క్లుప్తంగా

స్రవంతికి అభినందనలు



ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎ.స్రవంతి ఇటీవల కర్నూలు జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో జిల్లా తరుపున పాల్గొంది. పోటీలో తృతీయ స్థానం సాధించింది. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివరావు, పీడీ శ్రీనివాసరావు పాల్గొని స్రవంతిని అభినందించారు.

ఫిరంగిపురంలో అమృత కలశయాత్ర



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం అమృత కలశ యాత్ర నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటి నుంచి పవిత్రమైన మట్టిని సేకరించి దానిని మండల పరిషత్ కార్యాలయం వద్ద భద్రపర్చి దానిని మరలా జిల్లా పరిషత్ కార్యాలయానికి అందజేస్తామని చెప్పారు. దానిని ఢిల్లీ పంపుతారని అమృత వాటిక నిర్మాణానికి వినియోగిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, జి.చంద్రం, పి.జేమ్స్ఇన్నయ్య, ఎంపీడీఓ డి.అనూరాధ, ఈవోపీఆర్డీ నిర్మలాలక్ష్మీకుమారి, కె.చిన్నప్పరెడ్డి, మేడా బాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి అని, ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని వివరించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని తెలిపారు. వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా త్వరగా కోలుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన బోడపాటి శౌరి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని, అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే ఆర్కే రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు గొడవర్తి శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డేశ్వరం లక్ష్మణ్, గుడిసె రాజు, ప్రభాకర్, వడ్డేశ్వరం చంద్రరావు గుడిసె పున్నారావు, ప్రాతూరు పాల్‌రాజు, షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్ యూలోని లేన్ల మార్పిడి నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వడ్డేశ్వరం, ఇప్పటం, మెల్లంపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

ఉండవల్లిలో బ్లాక్ డే

తాడేపల్లిరూరల్: 2021 అక్టోబర్ 3న లకింపూర్ కేరీ ఘటనలో మృతి చెందిన అమరవీరులైన రైతాంగానికి జోహార్లు అర్పిస్తూ బ్లాక్ డేను రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో నిర్వహించారు. తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ 2021 అక్టోబర్ 3న లకింపూర్ కేరీ ఘటనలో రైతులు మృతి చెందారని ఇందుకు బాధ్యులైన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్ మిశ్రను పదవి నుంచి తొలగించాలని, ఢిల్లీ రైతాంగ పోరాటంలో రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డి.వెంకటరెడ్డి, ఖాజా వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కె.శివరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- ఇందిరానగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ఏర్పాటు
- హాజరైన జేసీ రాజకుమారి, కమిషనర్ శారదాదేవి



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జేసీ రాజకుమారి, కమిషనర్ యు శారదాదేవి

మంగళగిరి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని ఇందిరానగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జేసీ రాజకుమారి, కమిషనర్ యు శారదాదేవిలు పాల్గొని ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి వైద్య సేవలందుకోవడం అభినందనీయమన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్షను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి(ఆర్కే) సహకారంతో నగరంలో తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్లను అత్యాధునిక పరికరాలు, వసతులతో నిర్మించారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట ఆరోగ్య రక్ష అన్నారు. ప్రత్యేక క్యాంపులలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడంతోపాటు ఇంకా మెరుగైన చికిత్స అవసరమనుకుంటే ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. టోకెన్ పొందిన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ బి రాజకుమారి, కమిషనర్ శారదాదేవి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష గురించి వివరించారు. రోగులతో ఎలా మెలగాలనే అంశాలపై వైద్యులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం 50 మందికి ఆయుష్మాన్ భవ కార్డులు పంపిణీ చేశారు. టీబీ రోగులకు ఫుడ్ బాస్కెట్స్, వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా 42 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు బాషా, రాజాబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష రోగులకు పరీక్షలు నిర్వహించగా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణకు సీఎం జగన్ కృషి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. ఫిరంగిపురం శాంతిపేటలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలోని ఓపీ కౌంటర్‌ను ఆయన పరిశీలించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యులతో ఉచితంగా పరీక్షలు, మందులు అందేలా చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు సరిగా లేవని సురేష్‌కుమార్ దృష్టికి స్థానికులు తీసుకురావడంతో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ నిర్వహణ కోసం భవనం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎస్సీ హాస్టల్ ఖాళీగా ఉండటంతో దానిని వైద్యశాల వినియోగం కోసం కేటాయించాలని సర్పంచ్ మేడా బాబు కోరారు. స్పందించిన సురేష్‌కుమార్ ఆ శాఖ అధికారులతో మాట్లాడి భవనం వినియోగించుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేసారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైఎస్సార్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె.చిన్నప్పరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, డి.సురేష్, ఎం.సుధాకరరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, టి.డేవిడ్, కె.రామారావు, చేవూరి రామమోహన్ రెడ్డి, పి.లక్ష్మయ్య, కె.ఆనంద్, ఎంపీడీవో అనూరాధ, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, వైద్యులు పరీనాబేగం, యానీగ్రేస్, ఎస్తేరురాణి, బ్యూలా, మేఘన, భీమేష్‌నాయక్, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్ఎస్ కె.సాల్మన్‌రాజు, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కళ్లజోళ్లు అందుకున్న విద్యార్థులతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్

మేడికొండూరు: రాష్ట్రాన్ని 14 సంవత్సరాలు పాలించిన చంద్రబాబు ప్రజలకు ఏం చేశారో, నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏం చేస్తున్నారో గమనించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ప్రజలకు సూచించారు. మేడికొండూరు మండలం పాలడుగులో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలను ఓటు బ్యాంకుగా చంద్రబాబు వాడుకున్నారని అన్నారు. సీఎం వైఎస్.జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, గ్రామ సర్పంచ్ భారతి, ఎంపీటీసీ సభ్యులు రాజ్యలక్ష్మి బొడ్డు సాంబయ్య, మండల కన్వీనర్ టి.వంశీకృష్ణ, తూమాటి మురళి, అబ్బాస్, బి.చినసాంబయ్య, పి.సాయి, షేక్ రబ్బాని, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీఓ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు(తాడికొండ): జగనన్న సురక్షా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో వైద్య సేవలు అందించి ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తాడికొండ మండలం పాములపాడు, వెంకటపాలెం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్షా కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ఇంటి వద్దకే అందించేందుకు ప్రతి గ్రామంలో వైద్యులు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేయడం భారతదేశ చరిత్రలోనే ఇది తొలిసారి అన్నారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా వైద్య శిబిరాలలో జరుగుతున్న సేవలను తెలుసుకొని రోగులతో మాట్లాడి క్యాంపుల ద్వారా వారికి ప్రయోజనకరంగా ఉందా లేదా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, రాష్ట్ర రైతు విభాగం నాయకులు పరుచూరి నారాయణ, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల పున్నారావు, మండల ప్రత్యేకాధికారి పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్‌రావు, ఎంపీడీవో అత్తోట దీప్తి, ఈవోఆర్డీ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి కొప్పుల శేషగిరిరావు, తుళ్లూరు మండల జేసీఎస్ కన్వీనర్ బండి ప్రసాద్, వెంకటపాలెం గ్రామపార్టీ అధ్యక్షుడు అన్నూరి జక్రయ్య, పుల్లా కృష్ణ, బెజ్జం రాంబాబు, మందడం పార్టీ అధ్యక్షుడు ఆలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కారం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టి రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఈ సర్వే వల్ల రైతులకు శాశ్వత భూహక్కు రావడంతో భూ వివాదాలు కూడా పరిష్కారం అవుతున్నాయని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలో రీసర్వే పూర్తయిన సందర్భంగా డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌ను గతనెల 30వ తేదీన ప్రచురించారు. దానిపై అభ్యంతరాలు సేకరించేందుకు గ్రామసభ ఏర్పాటుచేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన భూ రీసర్వేపై ఇప్పటికే సచివాలయంలో డ్రాఫ్ట్ ఆర్ఓఆర్‌ను ప్రచురించామని, దానిపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, ఇక్కడే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేపై గ్రామసభలో ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే చేతులు ఎత్తి తమ ఆమోదాన్ని తెలపాలని కోరడంతో అందరూ రీ సర్వేపై సంతృప్తి వ్యక్తం చేస్తూ చేతులు ఎత్తారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇత్తడి రమేష్, ఎంపీటీసీ సభ్యులు సురేష్, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి రత్నకుమారి, గ్రామ సర్వేయర్ సునీత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఎలుకల నివారణ మందులు పంపిణీ

మంగళగిరి: మండలంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శైలజ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, రైతులంతా పాల్గొని వారికి కావాల్సిన ఎర పదార్థాన్ని రైతు భరోసా కేంద్రాలలో తీసుకోవాలని కోరారు.

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వరి వేసిన రైతులకు సామూహిక ఎలుకల నివారణ మందును బుధవారం ఉదయం 9 గంటలకు రైతు భరోసా కేంద్రాలలో ఉచితంగా అందజేస్తున్నామని తాడేపల్లి వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు నూకలు, నూనె తీసుకుని సమీప రైతు భరోసా కేంద్రాలలో మందును తీసుకుని రైతులందరూ సామూహికంగా ఒకేసారి ఎలుకల నివారణ మందును వాడి ఎలుకలను నివారించి పంటలను రక్షించుకోవాలని కోరారు.

దుగ్గిరాలలో.....

దుగ్గిరాల మండల పరిధిలో బుధవారం ఉచితంగా సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిణి శిరీష మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని రైతులు నూనె, నూకలతో సమీప రైతు భరోసా కేంద్రంలో ఉచితంగా అందజేసే ఎలుకల మందును తీసుకుని వరిపంట వేసిన రైతులందరూ ఒకేసారి ఎలుకల మందును పెట్టి తమ వరి పంటను కాపాడుకోవాలని, సామూహికంగా రైతులందరూ ఎలుకల మందు వాడడం వల్ల ఎలుకలను నివారించవచ్చని, రైతులందరూ తప్పక ఎలుకల మందును తీసుకువాలని కోరారు.

వీఐటీ- ఏపీలో సంగీత కచేరి



వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్‌చంద్రతో సంగీత కచేరీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

తాడికొండ: తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ–ఏపీలో మంగళవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ సెల్ సహకారంతో హార్మోనీ అనలిస్ట్ అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంగీత కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆర్జిత్‌సింగ్ పాడిన సోను నిగమ్ కల్ హో నాహో, సిడ్ శ్రీరామ్ పాడిన యువన్ శంకర్ రాజా నీ యదలో నాకు, శ్రేయ ఘోషల్ పాడటానికి శ్వేతా మోహన్ రాసిన వా వాతి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి కృత్రిమ మేథస్సు (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి సంగీత కచేరి నిర్వహించడం అభినందనీయమన్నారు. సంగీత ప్రపంచంలో సాంకేతికత, ఆవిష్కరణల శక్తికి ఈ సంఘటన నిజమైన నిదర్శనమన్నారు. కార్యక్రమంలో భాగంగా నల్ చాప్టర్ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ సీబీ చక్రవర్తి సాంకేతికత, సృజనాత్మకత అద్భుత కలయికతో రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మ్యూజిక్ వీడియోలు ప్రదర్శించారు. నల్ చాప్టర్ ప్రెసిడెంట్ వెంకట్ హర్ష రాయసం, వైస్ ప్రెసిడెంట్ కె ప్రణవ్ సాయి, సంజయ్‌ల సహకారాన్ని అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ ఐఈఈసీ డాక్టర్ అమీత్ చవాన్, డాక్టర్ హరిసీత, డాక్టర్ శిబి చక్రవర్తి, ప్రొఫెసర్ శామ్యూల్ జాన్సన్ డాక్టర్ సుధాకర్ ఇలంగో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మ ఆశ్రమ నిర్వాహకుడికి లైఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డు



ఐఆర్ఎస్ అధికారి భూపాల్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న రామలింగాచారి

తెనాలిటౌన్: పట్టణానికి చెందిన మహాత్మ ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి లైఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం చిట్యాలలోని మహాత్మగాంధీ దేవాలయం వ్యవస్థాపకులు, ఐఆర్ఎస్ అధికారి ఎం.భూపాల్‌రెడ్డి సోమవారం లైఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డును రామలింగాచారికి అందజేశారు. 20 ఏళ్ల నుంచి ఆశ్రమంలో వృద్ధులకు ఉచిత భోజనం, వసతి, ప్రాథమిక వైద్యసేవలు అందిస్తుండడంతో గుర్తింపుగా అవార్డు అందజేసినట్లు రామలింగాచారి తెలిపారు. గాంధీ జయంతి రోజున అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

నేడు పానకం బహిరంగ వేలం జరిగేనా!

- ఇప్పటికే రెండు సార్లు వాయిదా
- రెండు దరఖాస్తులు మాత్రమే కొనుగోలు చేసిన పాటదారులు
- మరలా పాతవారికే అవకాశం దక్కనుందా!

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పానకం తయారు చేసి భక్తులకు విక్రయించేందుకు ఈ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం బుధవారం ఉదయం 11 గంటలకు దిగువ సన్నిధిలోని ఆలయ ముఖమండపంలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన విషయం విదితమే. మూడో సారైనా ఒక కొలిక్కి వస్తుందా లేదా మరలా వాయిదా పడుతుందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. నిబంధనల మేరకు పానకం పాట పాడిన వెంటనే పాట పాడిన మొత్తం అదే రోజు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో పానకం పాటను రూ.1.09 కోట్లకు పాడిన విజయవాడకు చెందిన ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారు సమయానికి నగదు చెల్లించకపోవడంతో పాటను రద్దు చేశారు. రెండేళ్లుగా వేలంలో పాల్గొంటున్న ప్రహ్లాద ఎంటర్‌ప్రైజెస్ వారు అత్యధికంగా పాట పాడినా నగదు చెల్లించలేకపోవడంతో రద్దు చేస్తున్నారు. అయితే మరలా పాట పెట్టినప్పుడు వివిధ రకాల పేర్లతో వేలం దక్కించుకుంటున్నారు. గుత్తేదారు భక్తులను పానకం పేరుతో దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఏడాదైనా పానకం గుత్తేదారుడు మారతారా లేక పాతుకుపోయిన గుత్తేదారే దక్కించుకుంటారా అని భక్తులలో చర్చనీయాంశంగా మారింది. పాట పాడుకునేందుకు దరఖాస్తు ఫారాలను మంగళవారం సాయంత్రం 5 గంటల వరకే సమయం వుండగా పాత గుత్తేదారు మాత్రమే రెండు దరఖాస్తులు తీసుకోగా ఎవరు దరఖాస్తులు తీసుకోకపోవడంతో పాత గుత్తేదారుకే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ టెండర్, సీల్డు టెండర్లలో ఎవరైనా అధికంగా కోట్ చేసి ఉంటే తప్ప పానకం పాట పాత గుత్తేదారుడే తక్కువకే పాడుకునే అవకాశాలుండడం గమనార్హం. నిబంధనల ప్రకారం బుధవారం పానకం పాట పెట్టడం జరుగుతుందని ఈ టెండర్లు, సీల్డ్ టెండరు, బహిరంగవేలంలో ఏది అధికంగా పాట వస్తుందో వారికే కేటాయించడం జరుగుతుందని ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి తెలిపారు.

బీజేపీ గద్దె దిగాల్సిందే

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్
- ప్రజా చైతన్య యాత్ర ప్రారంభం



ప్రజా చైతన్య పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: దేశంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం దిగిపోవాల్సిందేనని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను ఆయన మంగళవారం ఉండవల్లి సెంటర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. గఫూర్ మాట్లాడుతూ దేశంలో సీపీఎం నికరమైన విధానాలు అవలంభిస్తోందని అన్నారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయాలని, అన్ని పార్టీలు అందుకు కట్టుబడి ఉండాలని అన్నారు. పార్టీ తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ వరకు జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని, 16వ తేదీన మంగళగిరిలోని నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, ఈమని అప్పారావు, చెంగయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాస కుమారి, కె.శివరామకృష్ణయ్య, ఎం.పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆటో

మంగళగిరి: మండలంలోని చినకాకాని వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడితో సహా ద్విచక్రవాహనం మురుగు కాలువలోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి నుంచి గుంటూరు ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకుడిని చినకాకాని వంతెన వద్ద ఆటో ఢీకొట్టింది. అదుపు తప్పిన ద్విచక్రవాహనం యువకుడితో సహా మురుగు కాలవలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు వెంటనే యువకుడిని బయటకు తీశారు. దెబ్బలు తగలడంతో ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ద్విచక్రవాహనం వెలికితీసి ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి వివరాలు తెలియరాలేదని ప్రాణాప్రాయం ఏమీ లేదని చిన్నపాటి దెబ్బలు తగలడంతో గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

21న ప్రత్యేక అదాలత్

తెనాలిరూరల్: ఈ నెల 21వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి మంగళవారం తెలిపారు. 21న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో రెవెన్యూ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లెయిముల వివాదాలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.


మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం అంగలకుదురులో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏబీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన ఎస్.బాబర్ వద్ద 13 క్వార్టరు సీసాలు లభించాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ చలం తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. తెనాలి– విజయవాడ రైలు మార్గంలోని కొలకలూరు స్టేషన్ సమీపంలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మంగళవారం రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టిందా అన్న అంశంపై స్పష్టత లేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పట్టణ ప్రముఖుడు వంగల మాధవరావు మృతి



తెనాలి: పట్టణ ప్రముఖుడు వంగల మాధవరావు (54) మృతి చెందారు. హృద్రోగ సమస్యతో ఆయన కొద్దిరోజులుగా హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. మంగళవారం ఉదయం ఆయన మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. వెండి వ్యాపారంలో కొనసాగుతున్న మాధవరావు తన నాయకత్వ లక్షణాలతో వివిధ సంఘాల్లో కీలకపాత్ర పోషిస్తూ వచ్చారు. ప్రస్తుతం తెనాలి పట్టణ వెండి వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఉపాధ్యక్షుడిగా కార్యక్రమాలను చేస్తున్నారు. తెనాలిలోని ప్రముఖ దేవస్థానం వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగానూ సేవలందించారు.